క్లుప్తంగా

ఉప సర్పంచ్‌పై అవిశ్వాస తీర్మానం



చేతులెత్తిన వార్డు సభ్యులు

దత్తిరాజేరు: మండలంలోని పెదమానాపురం ఉప సర్పంచ్ గురుబిల్లి ఆదినారాయణను మార్చాలని కొద్ది రోజుల కిందట వార్డు సభ్యులు ఫిర్యాదు చేయడంతో బొబ్బిలి ఆర్డీఓ రామ్మోహనరావు గురువారం అవిశ్వాస తీర్మానం నిర్వహించారు. గ్రామంలోని సచివాలయంలో నిర్వహించిన అవిశ్వాస తీర్మానానికి 12 మంది వార్డు సభ్యులకు గాను 11 మంది హాజరయ్యారు. ఉప సర్పంచ్‌ను వ్యతిరేకించిన వారు చేతులు ఎత్తాలని ఆర్డీఓ కోరడంతో ఎనిమిది చేతులెత్తారు. కొత్త ఉప సర్పంచ్‌ను ఎన్నుకునే వరకు కార్యదర్శి పంచాయతీ బాధ్యతలు చూస్తారని ఆర్డీఓ తెలిపారు.

ఘనంగా ఆలయ ప్రారంభోత్సవం



గోపుర శిఖరంపై పూర్ణకుంభంను ప్రతిష్ఠించి పూజలు చేస్తున్న భక్తులు

బొండపల్లి: మండలంలోని బోడ సింగిపేటలో నూతనంగా నిర్మించిన సీతా రామ ఆలయాన్ని గురువారం వైభవంగా ప్రారంభించారు. ఇందులో భాగంగా పూర్ణకుంభం ప్రతిష్ఠించి ప్రత్యేక పూజలు చేశారు. మధ్యాహ్నం నిర్వహించిన అన్నసమారాధనలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

రోడ్డు పరిశీలన



స్థానికులతో మాట్లాడుతున్న ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు


సాక్షి ఎఫెక్ట్..

వేపాడ: మండల కేంద్రంలోని బీసీ కాలనీ రహదారిపై నీరు నిలిచిపోవడంపై 'చెరువును తలపిస్తున్న బీసీ కాలనీ రోడ్డు' శీర్షికన సాక్షిలో గురువారం ప్రచురితమైన కథానికి ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు స్పందించారు. ఈ మేరకు ఏఈ దేవి, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసరావు రోడ్డును పరిశీలించారు. నీరు నిల్వ ఉండకుండా రోడ్డును అభివృద్ధి చేస్తామని చెప్పారు.

దరఖాస్తుల ఆహ్వానం

వేపాడ: మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో 2025 – 26 విద్యాసంవత్సరంలో 7, 8, 9 తరగతుల్లో మిగులు సీట్ల భర్తీకి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ప్రిన్సిపాల్ రావాడ ఈశ్వరరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులు జూన్ 10 నుండి 20లోగా www.cre.ap.gov.in అనే వెబ్‌సైట్‌లో ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఓసీ, బీసీ విద్యార్థులు 150 రూపాయలు.. ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు 75 రూపాయల ఫీజు చెల్లించాలని తెలిపారు. ప్రవేశ పరీక్ష జూన్ 24న ఆదర్శపాఠశాలలో నిర్వహిస్తామన్నారు.

నేడు వేంకటేశ్వరస్వామి ఆలయ ప్రారంభోత్సవం



వేంకటేశ్వరస్వామి ఆలయం

శృంగవరపుకోట: పుణ్య తిరుమలగిరి క్షేత్రంలో నిర్మించిన వేంకటేశ్వరస్వామి ఆలయాన్ని శుక్రవారం ఘనంగా ప్రారంభించనున్నారు. ఈ నెల 3వ తేదీ నుంచి త్రయాహ్నిక చతుష్కుండాత్మక ప్రతిష్ఠా మహోత్సవ కార్యక్రమాలు వేదోక్తంగా సాగుతున్నాయి. చతుస్థాన అర్చన, మూలమంత్ర మూర్తిమంత్ర హవనాలు, పంచామృతాభిషేకాలు, వాస్తుహోమం, ద్వార తోరణబలి, మహాపూర్ణాహుతి, తదితర కార్యక్రమాలను గురువారం చేపట్టారు. మరోపక్క ఆలయాన్ని భక్తులు సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దుతున్నారు. శుక్రవారం మధ్యాహ్నం సుమారు పది వేల మంది భక్తులకు అన్నదాన ఏర్పాట్లు చేస్తున్నారు. ఎమ్మెల్సీ రఘురాజు సూచన మేరకు భక్తులకు ఇబ్బంది కలగకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించనున్నారు.

చెత్త సంపద కేంద్రాలపై దృష్టి



చెత్త సంపద కేంద్రాన్ని పరిశీలిస్తున్న మండల ప్రత్యేకాధికారి వెంకటేశ్వరరావు, అధికారులు, ప్రజాప్రతినిధులు

మెరకముడిదాం: చెత్త నుంచి సంపదను సృష్టించే కేంద్రాలపై ప్రత్యేక దృష్టి సారించాలని మండల ప్రత్యేకాధికారి టి.వెంకటేశ్వరరావు అధికారులకు సూచించారు. మండల పరిధిలోని గర్భాంలో ఉన్న చెత్త సంపద కేంద్రాన్ని గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. చెత్తను ఎరువుగా మార్చి పంచాయతీకి ఆదాయం సమకూర్చుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ జి.భాస్కరరావు, సర్పంచ్ గాబ్రియల్, ఉప సర్పంచ్ తాడ్డి సత్యనారాయణ, మేజర్ పంచాయతీ ఈఓ విశ్వనాథం పాల్గొన్నారు.

నేటి మొక్కలే .. రేపటి మహా వృక్షాలు ..

నేటి మొక్కలే రేపటి మహావృక్షాలని వక్తలు అభిప్రాయపడ్డారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా ప్రభుత్వ, ప్రైవేట్ స్థలాల్లో గురువారం మొక్కలు నాటారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొని పర్యావరణ పరిరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను ఈ సందర్భంగా వివరించారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలన్నారు. భవిష్యత్ తరాలకు మెరుగైన పర్యావరణాన్ని అందించాల్సిన బాధ్యత అందరిపై ఉందని చెప్పారు. పర్యావరణానికి హాని కలిగించే పాలిథిన్ ఉత్పత్తుల వినియోగానికి దూరంగా ఉండాలని సూచించారు.

– సాక్షి నెట్‌వర్క్



లక్కవరపుకోట: లింగంపేట చెరువు వద్ద మొక్క నాటుతున్న ఎంపీడీఓ అప్పారావు



కొత్తవలస: చింతలదిమ్మ వద్ద గల చెరువు గట్టుపై మొక్క నాటుతున్న ఎంపీడీఓ రమణయ్య



దత్తిరాజేరు: పెదమానాపురం ఉన్నత పాఠశాలలో మొక్కకు నీరు పోస్తున్న బొబ్బిలి ఆర్డీఓ రామ్మోహనరావు



గంట్యాడ: రామవరంలో మొక్క నాటుతున్న మండల ప్రత్యేకాధికారి దుర్గా ప్రసాద్



చీపురుపల్లి: సచివాలయం వద్ద మొక్క నాటుతున్న అధికారులు, వైఎస్సార్‌సీపీ నాయకులు



గుర్ల: ఎంపీడీఓ కార్యాలయం వద్ద మొక్కలు నాటుతున్న జెడ్పీటీసీ సభ్యుడు శీర అప్పలనాయుడు, సన్యాసినాయుడు



గరివిడి: కోడూరులో మొక్కలు నాటిన ఎంపీడీఓ సుబ్రహ్మణ్యం, తహసీల్దార్ బంగార్రాజు



మెరకముడిదాం: గర్భాం సచివాలయం ఆవరణలో మొక్క నాటుతున్న ప్రత్యేకాధికారి వెంకటేశ్వరరావు, ఎంపీడీఓ భాస్కరరావు, సర్పంచ్ గాబ్రియల్, తదితరులు



గజపతినగరం: మండల పరిషత్ కార్యాలయంలో మొక్కలను నాటుతున్న అధికారులు, ప్రజాప్రతినిధులు



వేపాడ: మండల కేంద్రంలోని చెత్త సంపద కేంద్రం వద్ద మొక్క నాటుతున్న అధికారులు, గ్రామపెద్దలు



ఎస్.కోట: పట్టణంలో మొక్కలు నాటుతున్న ఫ్రెండ్స్ బ్యాడ్మింటన్ క్రీడాకారులు



ఎస్.కోట: పెదఖండేపల్లి రహదారి మొక్కలు నాటుతున్న జియో సభ్యులు

నేత్ర వైద్యశిబిరానికి స్పందన



వైద్యశిబిరాన్ని ప్రారంభిస్తున్న వైఎస్సార్‌సీపీ క్రిస్టియన్ సెల్ అధ్యక్షుడు విక్టర్ పాల్

దత్తిరాజేరు: మండలంలోని షికారుగంజి హెవెన్ చర్చిలో నవజీవన్ ట్రస్ట్ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన నేత్ర వైద్యశిబిరానికి మంచి స్పందన లభించింది. క్రిస్టియన్ సెల్ అధ్యక్షుడు విక్టర్ పాల్ శిబిరాన్ని ప్రారంభించారు. రామచంద్రపురం, దత్తి, గుచ్చిమి, పాచలవలస, చింతలవలస, లింగాలవలస, తదితర గ్రామాలకు చెందిన 67 మంది హాజరుకాగా.. విజయనగరం పుష్పగిరి కంటి ఆస్పత్రి వైద్యులు కోమలి, బి. బిందు, నాగరాజు తనిఖీలు నిర్వహించి, 37 మందిని శస్త్రచికిత్సలకు ఎంపిక చేశారు. కార్యక్రమంలో ట్రస్ట్ మేనేజర్ ఎస్వీ రమణ, లవ్ అండ్ నీడ్ సర్వీస్ సొసైటీ అధ్యక్షురాలు సారిక వాణి, తదితరులు పాల్గొన్నారు.

పోస్టల్ కార్యాలయాల్లో సేవింగ్స్ ఖాతాలు

చీపురుపల్లి: తపాలాశాఖ కార్యాలయాల్లో సేవింగ్స్ ఖాతాలు తెరవనున్నట్లు ఆ శాఖ చీపురుపల్లి సబ్ డివిజన్ ఇన్‌స్పెక్టర్ కె.సాయికిషోర్ తెలిపారు. ఈ మేరకు ఆయన గురువారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ.. సంక్షేమ పథకాల నగదు బదిలీ కోసం ఆధార్ సీడింగ్‌తో పాటు ఎన్‌పీసీఐ లింకేజ్ చేస్తూ ఖాతాలను తెరవనున్నట్లు చెప్పారు. పోస్టల్ కార్యాలయంలో ఖాతాలు తెరవాలనుకునే వారు కేవలం రూ.200 చెల్లిస్తే సరిపోతుందన్నారు. ఫోన్ పే, గూగుల్ పే వంటి యాప్‌కు సేవింగ్ ఖాతాను లింక్ చేసుకునే సదుపాయం కూడా ఉందని తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

బొండపల్లి: బొండపల్లి ఫీడర్ పరిధిలోని గ్రామాలకు శుక్రవారం విద్యుత్ సరఫరా నిలిపి వేయనున్నట్లు ఏపీఈపీడీసీఎల్ ఈఈ అనంత రామ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. బొండపల్లి, చందకపేట, బోడసింగిపేట, గెద్దపేట గ్రామాలకు ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేయనున్నట్లు పేర్కొన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

కొండతామరాపల్లి సబ్‌స్టేషన్ పరిధిలో..

గంట్యాడ: మండలంలోని కొండతామరపల్లి సబ్ స్టేషన్ పరిధిలో జంగిల్ క్లియరెన్స్ పనులు చేపట్టనున్న నేపథ్యంలో శుక్రవారం ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 11 వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ట్రాన్స్‌కో ఈఈ పి.త్రినాథరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కొండతామరాపల్లి గ్రామానికి సరఫరా ఉండదని.. వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఎస్.కోట విద్యార్థుల ప్రతిభ



జి.వేద



ఐ.నిఖిత



గుణశేఖర్



ఎం.కె.తన్మయి

శృంగవరపుకోట: నవోదయ విద్యాలయంలో 11వ తరగతిలో ప్రవేశం కోసం నిర్వహించిన ప్రవేశ పరీక్షలో ఎస్.కోట విద్యార్థులు జి.వేద, ఐ.నిఖిత, గుణశేఖర్, తన్మయి ప్రతిభ చూపారు. ప్రవేశానికి అర్హత సాధించిన విద్యార్థులను తల్లిదండ్రులతో పాటు డీవీఎం స్కూల్ డైరెక్టర్లు రాజేంద్రప్రసాద్, డా.వరలక్ష్మి, ప్రిన్సిపాల్ వై.జానకీదేవిలు గురువారం అభినందించారు.

నాణ్యతలో రాజీ పడవద్దు..



మధ్యాహ్న భోజనం నాణ్యతపై అవగాహన కలిగిస్తున్న ఎంఈఓలు

గజపతినగరం రూరల్: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు వడ్డించే మధ్యాహ్న భోజనం విషయంలో రాజీ పడితే సహించేది లేదని మండల విద్యాశాఖాధికారి విమలమ్మ తెలిపారు. గురువారం స్థానిక ఎంఈఓ కార్యాలయంలో ఎండీఎం నిర్వాహకులకు మధ్యాహ్న భోజనం నిర్వహణపై ఒక్కరోజు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మెను ప్రకారం భోజనం పెట్టాలన్నారు. ప్రభుత్వం విడుదల చేసిన నిధులను నిర్వాహకుల ఖాతాలకు జమ చేయడం జరుగుతుందని చెప్పారు. శిక్షణలో ఎంఈఓ – 2 సాయి చక్రధర్, సీఆర్పీలు రెడ్డి, లీల, తదితరులు పాల్గొన్నారు

కూటమి నాయకులకు కొమ్ముకాసిన ఆర్డీఓ



మాట్లాడుతున్న జెడ్పీటీసీ సభ్యురాలు రౌతు రాజేశ్వరి, తాజా మాజీ ఉప సర్పంచ్ ఆదినారాయణ

దత్తిరాజేరు: పెదమానాపురం ఉప సర్పంచ్‌పై గురువారం చేపట్టిన అవిశ్వాస తీర్మానంలో ఆర్డీఓ కూటమి నాయకులకు కొమ్ముకాశారని జెడ్పీటీసీ సభ్యురాలు రౌతు రాజేశ్వరి అన్నారు. తాజా మాజీ ఉప సర్పంచ్ గురుబిల్లి ఆదినారాయణ, ఇతర వార్డు మెంబర్లతో కలసి ఆమె విలేకరులతో మాట్లాడుతూ.. సర్పంచ్ మృతి చెందితే ఉప సర్పంచ్‌కు తాత్కాలిక సర్పంచ్‌గా అధికారం అప్పగిస్తే, కూటమి నాయకులు మంత్రికి లేనిపోనివి చెప్పి అవిశ్వాస తీర్మానం పెట్టించడం సరికాదన్నారు. కేవలం బెదిరింపులతో అవిశ్వాస తీర్మానం గెలిపించుకుని ఆదినారాయణను తప్పించారని మండిపడ్డారు. అవిశ్వాస తీర్మానానికి 30 మంది పోలీసులు బందోబస్తు నిర్వహించారంటే.. అధికార దుర్వినియోగం ఏ రీతిలో జరిగిందో అర్థం చేసుకోవచ్చన్నారు. తాజా మాజీ ఉప సర్పంచ్ గురుబిల్లి ఆదినారాయణ మాట్లాడుతూ.. మాకిచ్చిన నోటీసులు ఇంగ్లిష్‌లో ఉండడంతో సమాచారం అర్థం కాలేదని, ఈ విషయమై ఆర్డీఓను అడుగదామని లేవగా.. ఏం మాట్లాడకుండా కూర్చో అంటూ మండిపడ్డారని వాపోయారు. నిజాయితీగా పనిచేస్తున్న తనను తప్పుడు ఫిర్యాదులతో తప్పించారన్నారు.

పరిశీలన..



చీపురుపల్లి పట్టణంలోని రేషన్ దుకాణాలను ఇన్‌చార్జ్ ఆర్డీఓ ఆశయ్య గురువారం తనిఖీ చేశారు. ఎండీయూ ఆపరేటర్ వ్యవస్థను రద్దు చేసి తిరిగి పాత విధానం అమల్లోకి తీసుకొచ్చిన సందర్భంగా రేషన్ డిపోల పని తీరుపై ఆరా తీశారు. లబ్ధిదారులతో మాట్లాడుతూ..సరుకుల పంపిణీపై అభిప్రాయాలు అడిగి తెలుసుకున్నారు. సమయపాలన పాటించాలని డీలర్లకు సూచించారు. ఆయన వెంట తహసీల్దార్ ఎన్.రాజారావు, సీఎస్‌డీటీ నాగలక్ష్మి, డీలర్ రామారావు, తదితరులు పాల్గొన్నారు. – చీపురుపల్లి

అవగాహన ర్యాలీ..



కొత్తవలస మండలంలోని వియ్యంపేట పీహెచ్‌సీ పరిధిలో మలేరియా నివారణ మాసోత్సవ అవగాహన ర్యాలీని వైద్యాధికారి గోపాలకృష్ణ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఏడాదీ జూన్ 1 నుంచి 30వ తేది వరకు మలేరియా నివారణ మాసోత్సవాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇంటి పరిసర ప్రాంతాల్లో నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో పలువురు వైద్య సిబ్బంది పాల్గొన్నారు. – కొత్తవలస

తిరుగుబాటు మొదలైంది బాబూ..



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య

- వెన్నుపోటు దినం విజయవంతం కావడమే ఇందుకు నిదర్శనం
- మాజీ ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య

గజపతినగరం రూరల్: కూటమి ఏడాది పాలనపై ప్రజలు తిరుగుబాటుకు సిద్ధంగా ఉన్నారని.. 'వెన్నుపోటు దినం' విజయవంతం కావడమే ఇందుకు నిదర్శనమని మాజీ ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య అన్నారు. గురువారం స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన 'వెన్నుపోటు దినం' కార్యక్రమానికి ఐదు వేల మందికిపైగా ప్రజలు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయడంపై ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలియజేశారు. సూపర్‌సిక్స్ హామీల్లో ఒక్కటి కూడా అమలు చేయలేదని మండిపడ్డారు. కూటమి ప్రభుత్వ వైఫల్యాలపై ఎవరైనా ప్రశ్నిస్తే అక్రమ కేసులు పెడుతున్నారన్నారు. చంద్రబాబు ప్రభుత్వం ఎంత కక్షపూరితంగా వ్యవహరిస్తోందంటే ధర్నా చేద్దామని మైక్ పర్మిషన్ అడిగినా పోలీసులు ఇవ్వడం లేదని చెప్పారు. వైఎస్సార్‌సీపీని నిర్వీర్యం చేయాలని కూటమి ప్రభుత్వం యోచిస్తోందని ఆరోపించారు. వారు ఎన్ని కుట్రలు పన్నినా మళ్లీ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రావడం ఖాయమన్నారు. స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి 2019 వరకు 16 మెడికల్ కళాశాలలు ఏర్పాటైతే ఒక్క వైఎస్సార్‌సీపీ హయాంలోనే 17 కళాశాలలు ఏర్పాటు చేసిన ఘనత జగన్ మోహన్‌రెడ్డికే దక్కుతుందని చెప్పారు. నాడు విద్య, వైద్య రంగాలు ఎంతగానో అభివృద్ధి చెందగా...కూటమి ప్రభుత్వ హయాంలో ఆ రెండు రంగాలు పూర్తిగా భ్రష్టు పట్టాయన్నారు. ఏ ఆస్పత్రిలో చూసినా 108, 104 వాహనాలు కానరావడం లేదన్నారు.

సంపద ఎక్కడ సృష్టించావు బాబు..

ఎన్నికలకు ముందు సంపద సృష్టిస్తానని చెప్పిన చంద్రబాబు ఇప్పటివరకు ఎంత సంపద సృష్టించారో చెప్పాలని మాజీ ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య డిమాండ్ చేశారు. అధికారం చేపట్టాక ఒక్క హామీ కూడా నెరవేర్చలేకపోయారని ఎద్దేవా చేశారు. కోవిడ్ లాంటి విపత్కర పరిస్థితుల్లో కూడా అప్పటి ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలు అమలు చేశారని చెప్పారు. కూటమి ప్రభుత్వం ఏడాది పాలనలోనే 1,51,600 కోట్లు అప్పు చేయడం జరిగిందని, ఈ సొమ్మంతా ఎవరి జేబుల్లోకి వెళ్లిందో చెప్పాలని డిమాండ్‌చేశారు. సమావేశంలో జెడ్పీటీసీ సభ్యుడు గార తవుడు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షులు బూడి వెంకటరావు, పీఏసీఎస్ అధ్యక్షుడు కరణం ఆదినారాయణ, మండల నాయకులు బెల్లాన త్రినాథరావు, మధుపాడ సర్పంచ్ కె.పైడపునాయుడు, కనకల సుబ్రహ్మణ్యం, కర్రి రామునాయుడు, శీర రమణ, శ్రీను పాల్గొన్నారు.

ముందే మోగిన బడి గంట



- తెరుచుకున్న ప్రైవేట్ పాఠశాలలు..
- ప్రవేశాల కోసం ఆదుర్దా..
- నలిగిపోతున్న బాల్యం..

శృంగవరపుకోట: స్వేచ్ఛాయుత వాతావరణంలో పిల్లల ఆలోచనలు, ఆశయాలకు నష్టం లేకుండా విద్య నేర్పాలన్న లక్ష్యంతో తెచ్చిన బాలల విద్యాహక్కు చట్టం నీరుగారుతోంది. వేసవి సెలవులు పూర్తి కాకముందే ప్రైవేట్ పాఠశాలలు తెరుచుకున్నాయి. ప్రవేశాల కోసం యాజమాన్యాలు వెంపర్లాడుతున్నాయి. ఒంటిపూట బడులు అంటూ పిల్లల్ని మధ్యాహ్నం వేళ వరకూ ఉంచి, సాయంత్రం వేళల్లో ఉపాధ్యాయ సిబ్బందిని ఊళ్ల మీదికి ప్రచారం కోసం గడప గడపకూ పంపుతున్నారు. అంతా తెలిసిన విద్యా శాఖాధికారులు మాత్రం తమకేమీ తెలియనట్లు వ్యవహరిస్తున్నారు.

తెరుచుకున్న పాఠశాలలు..

రాష్ట్ర వ్యాప్తంగా జూన్ 13న పాఠశాలలు తెరవాలని పాఠశాల విద్యాశాఖ ఉత్తర్వులిచ్చింది. అయితే పట్టణంలోని పలు ప్రైవేట్ పాఠశాలలు ఈ ఆదేశాలను పట్టించుకోవడం లేదు. ఎస్.కోట పట్టణంలో ఇప్పటికే పలు ప్రైవేట్ పాఠశాలలు తెరుచుకున్నాయి. ప్రవేశాల కోసం వెంపర్లాడుతూ అంగడిలో దుకాణాల్లా తెరుచుకుని కూర్చున్నారు. పుస్తకాలు, యూనిఫారం అమ్మకాల కోసం పోటీ పడుతున్నారు.

ఎవరి తెలివి వారిది..

ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు ఈనెల 13వ తేదీ వరకు విద్యార్థులను సివిల్ దుస్తుల్లో పాఠశాలలకు పంపించాలని తల్లిదండ్రులకు సూచించాయి. యూనిఫారం ఉంటే ఫలానా స్కూల్ అని తెలుస్తుందన్న ఆలోచన వారిది. తాటిచెట్టు ఎందుకు ఎక్కావంటే దూడ గడ్డి కోసం అన్న తీరుగా.. స్కూల్ ఎందుకు తెరిచారంటే ఫలానా వాళ్లు ఓపెన్ చేశారు కాబట్టే మేము ఓపెన్ చేశామని చెబుతున్నారు. ఇక తల్లిదండ్రుల ఆత్రం చెప్పక్కర్లేదు. స్కూళ్లు ఎప్పుడు తెరుస్తారా అని ఎదురుచూస్తుంటారు. అంతే తప్ప పువ్వు లాంటి బాల్యాన్ని నలిపేస్తున్నామని, స్వేచ్ఛగా పిల్లలను ఎదగనీయడం లేదన్న ఆలోచన మాత్రం రాకపోవడం శోచనీయం.

వేతనం మూరెడు - చాకిరీ బారెడు..

ప్రైవేట్ పాఠశాలల్లో ఉపాధ్యాయ సిబ్బంది ఇబ్బందులు వర్ణనాతీతం. పిల్లల్ని కసరకూడదు.. తిట్టకూడదు.. కొట్టకూడదు కాని రిజల్ట్ మాత్రం రావాలి. సెలవులు అడక్కూడదు. రికార్డు వర్క్ అంతా సర్కారు టీచర్ల మాదిరిగానే చేయాలి. ఉద్యోగం ఉండాలంటే ప్రవేశాలు తీసుకురావాలి. ఇష్టం ఉన్నా లేకున్నా యాజమాన్యం చెప్పినట్లు గడప గడపకీ ప్రచారానికి పోవాలి. వేతనం మూరెడు – చాకిరీ బారెడు అన్న రీతిలో ఉంది ప్రైవేట్ పాఠశాలల ఉపాధ్యాయుల పరిస్థితి.